క్లుప్తంగా

ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఎన్నిక



చైర్మన్, వైస్ చైర్ పర్సన్‌ను సన్మానిస్తున్న గిరిజనులు

మఠంపల్లి : మండలంలోని పాతదొనబండతండాలో గల ఆంజనేయస్వామి దేవాలయ నూతన కమిటీని గిరిజనులు ఆదివారం స్థానిక దేవాలయ ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బానోతు చిన్నానాయక్, వైస్ చైర్ పర్సన్‌గా గోదావరి, ప్రధాన కార్యదర్శిగా నరేష్‌నాయక్, కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా గోవిందును ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీని శాలువాలతో ఘనంగా సన్మానించారు . ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ పట్టణ కార్యదర్శిగా గుండు వెంకటేశ్వర్లు



హుజూర్‌నగర్ : సీపీఐ హుజూర్‌నగర్ పట్టణ కార్యదర్శిగా గుండు వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సీపీఐ పట్టణ సమితి సమావేశంలో పార్టీ పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ పట్టణ సహాయ కార్యదర్శులుగా సోమగాని కృష్ణ, మామిడి వెంకయ్య, 14 మంది కమిటీ సభ్యులు, 34 మంది పట్టణ కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. వరుసగా నాలుగోసారి సీపీఐ పట్టణ కార్యదర్శిగా ఎన్నికైన గుండు వెంకటేశ్వర్లుకు సీపీఐ, వివిధ పార్టీల నాయకులు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

భగవద్గీతపై ప్రచారం



గ్రంథాలు పంపిణీ చేస్తున్న సమితి సభ్యులు

కోదాదరూరల్ : మండలంలోని కాపుగల్లు ఆవాస గ్రామమైన సర్వేశ్వరపురంలో కోదాడ త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పలు గ్రంథాలను పంపిణీ చేశారు. అనంతరం సమితి సభ్యులు మాట్లాడుతూ.. తమ మతమే గొప్పదని ఇతర మతాల మీద ద్వేషభావం కలిగి ఉండటం సరికాదని తెలిపారు. కార్యక్రమంలో కోదాడ శాఖ అధ్యక్షుడు పోటు వెంకటేశ్వర్లు, ముత్తవరపు శైలజ, చందన, వంగాల మహేష్, విజయ, జాస్తి శివరామకృష్ణ ఉన్నారు.

ఆచార్యులగూడెం వాసికి గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న నాగరాజు

చిలుకూరు : మండలంలోని ఆచార్యులగూడెం గ్రామానికి చెందిన ఆలోచన ఫౌండేషన్ చైర్మన్ మొలుగూరి నాగరాజుకు అమెరికాకు చెందిన డే స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అందజేసింది. శనివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో జరిగిన కార్యక్రమంలో డే స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఇండియాకు సంబంధించిన చాన్స్‌లర్ డాక్టర్ జేమ్స్ ఆమోస్, డాక్టర్ శిరీషారెడ్డి.. నాగరాజుకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. విద్యార్థి సంఘం నాయకుడిగా విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ, ఆలోచన ఫౌండేషన్ పేరుతో సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నందుకు గాను యూనివర్సిటీ తనకు గౌరవ డాక్టరేట్ అందజేసినట్లు నాగరాజు తెలిపారు. నాగరాజుకు గౌరవ డాక్టరేట్ రావడం పట్ల గ్రామస్తులు, మండలవాసులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ పథకాలు దూరం



సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

హుజూర్‌నగర్ : నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ పథకాలు దూరమవుతున్నాయని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ అనుబంధ సంఘం) జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సోమయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో వెల్ఫేర్ బోర్డు నూతన విధానాలను రూపొందించి కార్మికులకు సంక్షేమ పథకాలను దూరం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అంజయ్య, రాజు, రాంబాబు, వెంకన్న, మల్లేష్, వీరస్వామి, శాంతయ్య, నాగయ్య, నాగుల మీరా, మల్లేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

తోడేస్తున్నారు !



మోతె మండల పరిధిలోని పాలేరు వాగులో ఇసుక తోడి తెప్పలపై ఒడ్డుకు చేర్చుతున్న కూలీలు

- పాలేరు వాగు నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- ఇసుకను పొలాల్లో డంప్ చేసి వాహనాల్లో తరలిస్తున్న వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు



వ్యవసాయ పొలాల మధ్య డంప్ చేసిన ఇసుక కుప్పలు

మోతె : మండలంలోని పాలేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అడ్డుకునేవారు లేకపోవడంతో మూడు పువ్వులు, ఆరు కాయలుగా ఇసుక దందా కొనసాగుతోంది. వాగు నుంచి ప్రతిరోజూ సుమారు 30 నుంచి 50 ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా వ్యాపారులు మోతె మండలానికి సరిహద్దు జిల్లాలైన ఖమ్మం, వరంగల్‌కు తరలిస్తున్నారు. పాలేరు వాగుకు చుట్టు పక్కల ఉన్న నర్సింహాపురం, ఉర్లుగొండ, తుమ్మగూడెం, రంగాపురంతండా తదితర గ్రామాలకు చెందిన ఇసుక వ్యాపారులు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా అటువైపు కన్నెత్తి చూసే అధికారులే కరువయ్యారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చినప్పుడు మాత్రం పోలీసులు వచ్చి హడావుడి చేసి నామమాత్రంగా రెండు, మూడు ట్రాక్టర్లు పట్టుకొని కేసులు చేసి తిరిగి వదిలేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. సరైన చర్యలు తీసుకోకపోవడంతో ఇసుక మాఫీయా రెచ్చిపోతున్నారని గ్రామాల ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు, సంబంధిత అధికారులు పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణాను అడ్డుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు. ప్రభుత్వం ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసి ఇసుక కావాల్సిన వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు సరఫరా చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జికి ప్రమాదం..

నర్సింహాపురం– ఉర్లుగొండ గ్రామాల మధ్య పాలేరు వాగుపై నిర్మించిన బ్రిడ్జి కింద ఫిల్లర్ల వద్ద అడుగున ఇసుకను నీళ్లల్లో మునిగి తోడుతున్నారు. ఇలా తోడిన ఇసుకను తెప్పలపై ఒడ్డుకు చేర్చి డంప్ చేసి వాహనాల్లో తరలిస్తున్నారు. బ్రిడ్జి ఫిల్లర్ల వద్ద ఇసుక తోడుతుండడంతో బ్రిడ్జికి ప్రమాదం పొంచి ఉందని స్థానికులు అంటున్నారు. ఈ విషయమై అనేకసార్లు ఇసుక వ్యాపారులను హెచ్చరించినా వారి తీరు మారడం లేదని చెబుతున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లోని చెర్వులు, కుంటల్లో ఇసుక వ్యాపారులు అక్రమంగా ఇసుక తరలించినట్లు తెలిస్తే చర్యలు తప్పవు. మైనింగ్ అధికారుల నుంచి అనుమతులు వస్తే ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసి వినియోగదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక సరఫరా చేసేందుకు కృషి చేస్తాం.

– ఎం.వెంకన్న, తహసీల్దార్, మోతె

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య



ప్రచార జాతాలో పాల్గొన్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

హుజూర్‌నగర్ : ప్రభుత్వ బడుల్లోనే పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్ కుమార్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచుటకు టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ప్రచారజాతాను ఆదివారం హుజూర్‌నగర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల బలోపేతమే టీఎస్ యూటీఎఫ్ ధ్యేయమని అన్నారు. ప్రభుత్వ బడులలో అర్హత కలిగిన ఉపాధ్యాయులు బోధిస్తారని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను చదివిస్తే తల్లిదండ్రుల సంపాదనలో సగానికి పైగా పిల్లల చదువులకే ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఉపాధ్యాయులు చెన్న సైదులు, జహూరే ఆలం, పొదిల సైదులు, మామిడి వెంకటేశ్వర్లు, ఆర్.దామోదర్, జెట్టి కమల, రాజశేఖర్‌రెడ్డి, వడ్లానపు రామకృష్ణ, చిరంజీవి, చిక్కుళ్ల గోవింద్, స్రవంతి, రేణుక, నాగమణి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న ఆశ్రమ నిర్వాహకురాలు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో ఆదివారం నడిగూడెం మండల కేంద్రానికి చెందిన మన్నెం వీరారెడ్డి –చంద్రమ్మ వర్ధంతిని పురస్కరించుకొని వారి కుమారుడు మన్నెం నిరంజన్‌రెడ్డి –అరుణ దంపతుల సహకారంతో వృద్ధులు, మానసిక వికలాంగులు, అనాథలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మ, కోఆర్డినేటర్ వాచేపల్లి జ్యోతి పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులు అవలంబించాలి



రైతు సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త పద్మావతి

నేరేడుచర్ల : ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని భారత వరి పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్లు పద్మావతి, మానస అన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నేరేడుచర్ల మండలం మేడారం గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. పంటల ఉత్పత్తి, నేల ఆరోగ్యం , వనరుల నిర్వహణపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పురాతన పద్ధతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమన్వయం చేయడం ద్వారా దిగుబడులు పెరుగుతాయన్నారు. భూసార పరీక్షల ఆధారంగా పంటలకు ఎరువులు, మందులు వినియోగిస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్తలు కిరణ్, కవిరాజు, ఫీల్డ్ ఆఫీసర్ శరత్, ఏఓ జావీద్, రైతులు ఉన్నారు.

వెంకటనరసింహారెడ్డి మృతి తీరని లోటు



వెంకటనరసింహారెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రామారావు, తదితరులు

మునగాల : మండల కేంద్రానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు కొప్పుల వెంకటనరసింహారెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావు అన్నారు. ఆదివారం మునగాలలో కొప్పుల వెంకటనరసింహారెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన వెంకటనరసింహారెడ్డి పదవీ విరమణ అనంతరం కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసి పార్టీ పురోభివృద్ధికి ఎనలేని కృషిచేశాడని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఉప్పుల జానకిరెడ్డి, యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తక్కెళ్లపాటి సాయి, నరసింహారెడ్డి కుమారులు కొప్పుల మట్టారెడ్డి, కొప్పుల జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రిజర్వేషన్ కల్పించాకే ఎన్నికలు పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్

గరిడేపల్లి : దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించిన తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం గరిడేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సమితి మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగుల పెన్షన్ రూ. 6 వేలు, వృద్ధులు, వితంతువులు, గీత కార్మికులు, బీడీ కార్మికుల పెన్షన్ రూ.4వేలకు పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి పదహారు నెలలవుతున్నా అమలు చేయకుండా ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగాలేదని అనడం అన్యాయమన్నారు. హామీలను అమలు చేయాలని లేకుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలోసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం నరేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కొల్లూరి ఈదయ్యబాబు, నాగమణి, కుర్ర గోపి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చిలుకూరు : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, నాటి ఉపాధ్యాయులు

చిలుకూరు : మండలంలోని కొండాపురం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాఠశాల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనంద పడ్డారు. అనంతరం నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులును సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అజయ్‌కుమార్, గోపాల కృష్ణ, నాగజ్యోతి, విజయలక్ష్మి, నాటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోదాడలో..

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని పెరికభవన్‌లో చిలుకూరు మండలం రామాపురంలో గల గేట్ ఇంజినీరింగ్ కళాశాలలో 2008– 2012 విద్యా సంవత్సరంలో బీటెక్ (ఈఈఈ) చదివిన మొట్టమొదటి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని, కళాశాల నాటి రోజులను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. అధ్యాపకులను సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కోదాడరూరల్ : సమ్మేళనంలో పాల్గొన్న గేట్ కళాశాల పూర్వ విద్యార్థులు

రేపటి నుంచి గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు

మునగాల : మండలంలోని 11 రెవెన్యూ గ్రామాల్లో ఈనెల 3వ తేదీ నుంచి 17 వరకు నిర్వహించే భూభారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బుసిరెడ్డి రామకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఆదివారం సదస్సుల షెడ్యూలు కరపత్రం ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఈనెల 3న కొక్కిరేణి, తిమ్మారెడ్డిగూడెం గ్రామాల రైతులకు కొక్కిరేణిలో సదస్సు నిర్వహిస్తామన్నారు. 4న గణపవరం, 5న ఆకుపాములలో జరిగే సదస్సుకు ముకుందాపురం, కోదండరామాపురం, కిష్టాపురం, శ్రీకృష్ణ హోమ్స్ పరిధిలోని రైతులు హాజరు కావాలన్నారు. 6న బరాఖత్‌గూడెంలో సదస్సుకు బరాఖత్‌గూడెం, కృష్ణానగర్, శ్రీనివాసనగర్ గ్రామాల రైతులు, 9న కలకోవలో, 10న రేపాలలో జరిగే సదస్సుకు ఆవాస గ్రామాలైన విజయరాఘవపురం, సీతానగరం, సీతానగరం తండా, జగన్నాథపురం, నరసింహులగూడెం, నాగార్జుననగర్ రైతులు, 11న తాడువాయిలో సదస్సుకు ఆవాస గ్రామాలైన తాడువాయి తండా, వెంకటరామాపురం రైతులు హాజరు కావాలన్నారు. 12న ఎస్ఎంపేటలో జరిగే సదస్సుకు వెంకటరామాపురం, వెంకట్రామపురం బాడవ, మొద్దులచెరువు గ్రామాల రైతులు, 13న నేలమర్రిలో జరిగే సదస్సుకు ఈదులవాగు తండా, మిట్టగూడెం, మొరసకుంట తండా, కొలిశెట్టి గూడెం, 17న మునగాలలో జరిగే సదస్సుకు మునగాల, నారాయణగూడెం గ్రామాల రైతులకు సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సులను ఆయా గ్రామాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామని తెలిపారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

మోతె : మండలంలోని గ్రామాల్లో మంగళవారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.వెంకన్న ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 3న కూడలి, అన్నారిగూడెం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 4న సర్వారం, నేరడవాయి, 5న బుర్కచర్ల, తుమ్మలపల్లి, 6న సిరికొండ, విభళాపురం, 9న నామవరం, హుస్సేన్‌బాద్, 10న రాఘవాపురం, మామిళ్లగూడెం, 11న మోతె, ఉర్లుగొండ, 12న రావిపహాడ్, సింగరేణిపల్లె, 13న గోపతండాలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేరేడుచర్ల : మండలంలోని గ్రామాల్లో ఈనెల 3వ తేదీ నుంచి భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సురిగి సైదులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తేదీన బొడలదిన్న, 4న యల్లారం, 5న జానలదిన్నెలో జరిగే సదస్సుకు జానలదిన్నె, వైకుంఠాపురం రైతులు, 6న దాచారంలో జరిగే సదస్సులో దాచారం, శ్రీరంగపురం రైతులు పాల్గొనాలని తెలిపారు. 9న పత్తేపురం, 10న మేడారంలో జరిగే సదస్సుకు మేడారం, బక్కయ్యగూడెం రైతులు, 11న చిల్లేపల్లిలో జరిగే సదస్సుకు చిల్లెపల్లి, చింతకుంట్ల రైతులు హాజరు కావాలని తెలిపారు. 12న పెంచికల్‌దిన్నెలో జరిగే సదస్సుకు కల్వలదిన్నె, తెలగరామయ్యగూడెం గ్రామాల రైతులు పెంచికల్‌దిన్నె గ్రామాల రైతులు, 13న సోమారంలో జరిగే సదస్సుకు బురుగులతండా, సోమారం రైతులు, 16న కల్లూరులో జరిగే సదస్సుకు ముకుందాపురం, లాల్‌లక్ష్మీపురం, కల్లూరు గ్రామ రైతులు పాల్గొనాలని తెలిపారు. 17న నేరేడుచర్ల, రామాపురం, కమలానగర్, శాంతినగర్, బట్టువానికుంట గ్రామాల రైతులకు తహసీల్దార్ కార్యాలయంలో, 18న దిర్శించర్ల, కందులవారిగూడెం, ఇంజంవారిగూడెం, పీర్‌సాహెబ్‌గూడెం, కోటయ్యగూడెం, జగనాతండా, మూసీఒడ్డుతండా రైతులకు దిర్శించర్లలో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మేళ్లచెరువు : ఈ నెల 3వ తేదీ నుంచి 9 వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నూకల రాజేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న మేళ్లచెరువులో, 4న రేవూరులో, 5న వేపలమాధవరంలో, 9న కందిబండలో సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకొని భూసమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

నడిగూడెం : మండల వ్యాప్తంగా ఈ నెల 3 నుంచి 17 వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వి.సరిత ఆదివారం తెలిపారు. 3న తెల్లబెల్లి, 4న రామాపురం, 5న చాకిరాల, 6న సిరిపురం, 9న నడిగూడెం, 10న రత్నవరం, 11 ఎకలాస్‌ఖాన్‌పేట, 12న బృందావనపురం, 13న వల్లాపురం, 16న కాగితరామచంద్రాపురం, 17న కరివిరాల గ్రామంలో రెవెన్యూ సదస్సులు ఉంటాయని తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సులకు రైతులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బాలయ్యను ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నక్క బాలయ్య భార్య పిచ్చమ్మ (55) ఆదివారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆమె మృతదేహాన్ని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలయ్యను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట స్థానిక మాజీ సర్పంచ్ దున్నా సుధాకర్, కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండి.జలీల్, నక్క గంగరాజు, నక్క సైదులు, వెంకటేష్, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

నారాయణపురం మాజీ సర్పంచ్ మృతి



ఆంజనేయులు (ఫైల్)

చిలుకూరు : మండలంలోని నారాయణపురం గ్రామ మాజీ సర్పంచ్ బూర ఆంజనేయులు (70) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. బూర అంజనేయులు మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సంతాపం వ్యక్తం చేసి మృతదేహం వద్ద నివాళులర్పించారు. అదేవిధంగా మాజీ ప్రజాప్రతినిధులు, సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు, గ్రామస్తులు.. ఆంజనేయులు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

నేటి నుంచి జీలుగ విత్తనాల పంపిణీ

మునగాల : మండలంలోని రైతులకు వానాకాలం సీజన్‌కు సంబంధించి జీలుగ విత్తనాలు సోమవారం నుంచి రైతులకు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి బుంగా రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్సిడీ పోను 30 కేజీల జీలుగ విత్తనాల సంచి రూ.2137.50కు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో దరఖాస్తును మునగాల మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు. ప్రస్తుతం 60 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు.

యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దు

మునగాల: గ్రామీణ ప్రాంత యువత మద్యం, జూదం వంటి చెడు వ్యసనాలకు బానిస కావొద్దని స్థానిక ఎస్ఐ బి.ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థాయిలో నిలిచి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని సూచించారు. మంచి మార్గంలో నడిచి తమ బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసై నష్టపోవద్దని సూచించారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

మునగాల : ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ కోరారు. ఆదివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాల వల్ల మానవజాతికి క్యాన్సర్ ప్రమాదం పొంచి ఉందని, ఎంతో మంది క్యాన్సర్ భూతానికి బలైపోతున్నారని తెలిపారు. దుకాణాల్లో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించి జూట్ బ్యాగులు, గోనె సంచులు వాడేలా చూడాలని కోరారు. ప్రభుత్వాలు ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు పరచాలని డిమాండ్ చేశారు.

రహదారిని కమ్మేసిన కంపచెట్లు



రామాపురం గ్రామ సమీపంలో రోడ్డును కమ్మేసిన కంపచెట్లు



రామాపురం రోడ్డులోని పెట్రోల్ బంక్ సమీపంలో..

చిలుకూరు : మండల కేంద్రంలోని శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయం నుంచి రామాపురం వెళ్లే రోడ్డులో ఇరుపక్కల కంపచెట్లు ఏపుగా పెరిగి దారి ప్రమాదకరంగా మారింది. ప్రధానంగా మూలమలుపుల్లో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై చిలుకూరు, రామాపురం గ్రామాలకు చెందిన రైతులు సంబంధిత అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ రాజ్ అధికారులు స్పందించి తక్షణమే రోడ్డుకు ఇరు పక్కల పెరిగిన కంపచెట్లను తొలగించి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దంతెల వాగు ఆక్రమణపై పట్టింపేదీ!



వాగును కబ్జా చేసి చదును చేసిన ఆక్రమణదారులు

మునగాల : మండలంలోని తాడువాయి శివారులో గల దంతెల వాగును కొందరు యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. వాగు చుట్టుపక్కల వ్యవసాయ భూములు గల రైతులు గత కొంతకాలంగా మట్టిపోసి చదును చేసి ఆక్రమించుకుంటున్నారు. అయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామప్రజలు ఆరోపిస్తున్నారు. తాడువాయి గ్రామ రెవెన్యూ పరిధిలో గల దంతెలవాగు ప్రకృతి సిద్ధంగా ఏర్పడి గణపవరం చెరువుకు వరద వాగుగా ప్రసిద్ధి చెందింది. సుమారు 100 ఎకరాల్లో ఈ వాగు విస్తరించి ఉందని, కానీ ప్రస్తుత కబ్జాలతో వాగు కాలక్రమేణ కనుమరుగయ్యే పరిస్థితి నెలకొన్నదని స్థానికులు చెబుతున్నారు. వర్షాకాలంలో వరద ఈ వాగు గుండా ప్రవహించి గణపవరం చెరువుకు చేరుకొని చెరువు నిరంతరం నిండుకుండలా ఉంటుందని అంటున్నారు. ఆక్రమణల విషయం తెలుసుకున్న సంబంధిత శాఖ అధికారులు వాగును పరిశీలించి ఆక్రమణదారులను హెచ్చరించి వెళ్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఆక్రమణ పర్వం కొనసాగుతుందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదిక వాగును పూర్తిస్థాయిలో సర్వే చేసి ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకోవాలని గ్రామప్రజలు కోరతున్నారు.